## క్లుప్తంగా

### 50మంది నిరుపేదలకు వస్త్రాల పంపిణీ



నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాతలు

బలిజిపేట: స్థానికురాలైన పూసర్ల లక్ష్మి 3వ వర్ధంతి సందర్భంగా భర్త గౌరీ శంకర్ 50మంది నిరుపేదలకు మంగళవారం వస్త్రాలు పంపిణీ చేశారు. అదేవిధంగా నేతాజీ గ్రంథాలయానికి 4కుర్చీలు వితరణగా అందించారు. నిరుపేదలకు ఈ విధంగా సేవా కార్యక్రమం చేయడం ఎంతో సంతృప్తిగా ఉందని గౌరీశంకర్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఈర్ల సంజీవనాయుడు, పి.కోటీశ్వరరావు, ఈశ్వరమ్మ, బంగారాజు తదితరులు పాల్గొన్నారు.

### శిలాఫలకాల పర్యవేక్షణ



పదమాయవలసలో శిలాఫలకాన్ని పర్యవేక్షించిన అధికారులు

బలిజిపేట: నా భూమి..నా దేశం కార్యక్రమంలో భాగంగా పంచాయతీల వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓ కేశవరావులు మంగళవారం పర్యవేక్షించారు. స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. అందులో భాగంగా ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో పంచాయతీల వద్ద శిలాఫలకాలను ఏర్పాటుచేయడం, మొక్కలు నాటడం చేస్తున్నట్లు తెలిపారు. 75సంవత్సరాల గుర్తింపు ఉండే విధంగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 9వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బదిలీ అధ్యాపకులకు సత్కారం



అధ్యాపకుడు రవికుమార్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్‌త్రినాథ్, సిబ్బంది

సీతానగరం: ఉద్యోగులకు బదిలీలు పదోన్నతులు అనివార్యమే ఆయినా విధి నిర్వహణలో వారందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచి పోతాయని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సుదీర్ఘకాలం పని చేసి బదిలీపై వెళ్లిన అధ్యాపకులు, సిబ్బందికి మంగళవారం సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ త్రినాథ్ మాట్లాడుతూ సీతానగరం జూనియర్ కాలేజీలో టి.రవికుమార్, కిశోర్‌కుమార్, ఇందిర, వసంత్ కుమార్ అరుణకుమారి అధ్యాపకులుగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న బాలికలు

సీతంపేట: స్థానిక గిరిజన బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆహ్వానం పలుకుతూ ఈ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్ పి.సూర్యకుమారి మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉమాదేవి, డిప్యూటీ వార్డెన్ రామానందం, అధ్యాపకులు సత్యవతి, నాగమణి, సుజాత, పద్మావతి, అర్జున్‌రావు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల వినతి

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవల వివరాలు నమోదు చేస్తున్న యాప్ వినియోగంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు కోరారు. ఈ మేరకు మండలంలోని నవగాం సచివాయల సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్.హిమప్రభ, టి.దివ్య, ఇందిర, ఇందు పాల్గొన్నారు.

# టీకాల లక్ష్యం శతశాతం సాధించాలి

● డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్.బి జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్:

శతశాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని నిర్వహించాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ఆయన పట్టణంలోని ఒకటవ వార్డులో వైద్యసిబ్బంది మంగళవారం నిర్వహించిన మిషన్ ఇంద్రధనుష్ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం గతంలో వ్యాధినిరోధక టీకాలు వేయించని పిల్లల జాబితా, అందుకు గల కారణాలు, ఏఏ టీకాలు ప్రస్తుతం వేస్తున్నారు? తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. అదేవిధంగా గర్భిణులకు టీడీవ్యాక్సిన్ అర్హులకు వెంటనే టీకా పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి బుధ, శని వారాల్లో నిర్వహిస్తున్న సార్వత్రిక టీకా కార్యక్రమంలో గతంలో వివిధ కారణాలతో గాని, కొందరు వారి జీవన శైలి కారణంగా గానీ ప్రణాళిక ప్రకారం టీకా వేసిన ప్రతి పిల్లలకు మిషన్ ఇంద్రధనుష్‌లో పూర్తి స్థాయిలో వేయాలని డాక్టర్ జగన్నాథరావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ప్రారంభమైన మొదటి దశ మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం శనివారం వరకు కొనసాగుతుందని తద్వారా శతశాతం లక్ష్యంగా పిలలు, గర్భిణులకు టీకాలు వేయాలని సూచించారు.

**478 టీకా కేంద్రాల్లో టీకా కార్యక్రమం**

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ 350 సచివాలయాల పరిధిలోని 478 టీకా కేంద్రాల్లో 384 మంది వ్యాక్సినేటర్స్(ఏఎన్ఎమ్) మొదటి దశ(7 నుండి 12 వరకు) మిషన్ ఇంద్రధనుష్‌లో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారని చెప్పారు. టీకా వేసిన వివరాలన్నీ వైద్య ఆరోగ్య శాఖ వారు కొత్తగా చేర్చిన యూవిన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్ వైజర్స్ పుష్ప, జయగౌడ్, శ్రీధర్, ఏఎన్ఎం నాగమణి, అంగన్‌వాడీ సిబ్బంది ప్రమీలారాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్వతీపురంలో సమస్యల పరిష్కారం



వార్డుల్లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పట్టణంలో సమస్యలు లేకుంగా చేస్తామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు అయన పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలోని 29వ వార్డులో మంగళవారం నిర్వహించిన 'నా అడుగు మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన శానిటేషన్, కాలువలు, రోడ్లు, తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డుల్లో గుర్తించిన సమస్యలను పురపాలక సంఘం అధికారులకు వివరించడమే కాకుండా మరుసటి రోజు నుంచే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ప్రతిరోజూ క్రమం తప్పకుంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం ప్రజలకోసం నిరంతరం పని చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గుణేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవి కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణ కల్పించాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

● పార్వతీపురంలో ఎస్ఎఫ్ఐ ర్యాలీ

పార్వతీపురంటౌన్: మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి మోడీ పూనుకోవాలని, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్‌లు కోరారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 జాతీయ వసంతాల సందర్భంగా గత సంవత్సరం అమృతోత్సవాలకు పిలుపునిచ్చిన మోడీ, 76 వ జాతీయ వసంతాల సందర్భంగా సేవ్ మణిపూర్ కార్యక్రమాలకు పిలుపునివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సీహెచ్.సింహాచలం, కె.రాజు, పట్టణంలో గల వివిధ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### అప్రెంటీస్ మేళా రేపు

సీతంపేట: ఐటీఐ పాసైన విద్యార్థుల కోసం ఈనెల 10న అప్రెంటీ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణాలోని మేదా సెర్వో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్, మెకానికల్ విభాగాల్లో అప్రెంటిషిప్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.13,500ల స్టైయిఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత ట్రేడ్ సబ్జెక్టుపై రాతపరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 9390063881, 9493817472కు ఫోన్ చేయాలన్నారు.

### స్టోన్ ప్లాంటేషన్ పనుల పరిశీలన



స్టోన్ ప్లాంటేషన్‌పై ఆరాతీస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

వీరఘట్టం: భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ నూరల్‌కమర్ ఆదేశించారు. మండలంలోని పాలమెట్ట గ్రామంలో చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులు, గ్రామస్తుల సహకారంతో సర్వే పూర్తిచేయాలని, పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### జిల్లా ఖజానా అధికారికి సన్మానం



జిల్లా ఖజానా అధికారి కుమార్‌ను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

కురుపాం: స్థానిక ఉపఖజానా కార్యాలయాన్ని జిల్లా ఖజానా అధికారి ఆర్.ఎస్.ఎ కుమార్ మంగళవారం సందర్శించారు. కార్యాలయ రికార్డులు, ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల ఈకేవైసీ ఆన్‌లైన్ నమోదును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొదటిసారిగా ఉపఖజానా కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా ఖజానా అధికారిని యూటీఎఫ్ నాయకులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

# గుమ్మలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్యతనిఖీలు చేస్తున్న డాక్టర్ బి.ప్రజ్ఞ

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.ప్రజ్ఞ గ్రామంలో 92 మందికి వైద్యసేవలు అందించారు. బాలింతలకు, గర్భిణులకు సాధారణ వైద్య తనిఖీలు చేసి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మలేరియా, డెంగీ, డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ భారతి, భగవతి, ఆనంద్ పాల్గొన్నారు.

# కాలిబాటలతో బహుళ ప్రయోజనాలు



ఉల్లిభద్ర సమీపంలో కాలిబాటలు వేసిన వరిపొలం

గరుగుబిల్లి: వరిపంటలో కుదుళ్లను దగ్గరగా నాటడం వల్ల పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఎక్కువగా ఉంది. దీని నివారణకు నాటిన సమయంలోనే కాలిబాటలను వేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. కాలిబాటలను వేసుకోవడం వల్ల పంటకు గాలి, సూర్యరశ్మి సక్రమంగా అందడంతో పంట ఏపుగా వచ్చే అవకాశం ఉంది. అలాగే పంటకు తెగుళ్లు సోకకుండా కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. వరి నాట్లు వేసే విధానం, కాలిబాటల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

**గొచ్చులుగా నాటొద్దు**

వరికుదుళ్లను గొచ్చులుగా నాటడం వల్ల పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందక పైరు పెరుగుదల మందగించడంతో పాటు చీడపీడలు తొందరగా ఆశిస్తాయి. సాధారణంగా ఎక్కువగా వరి మొనలను నాటితే ఎక్కువ దిగుబడి వస్తుందని రైతులు భావిస్తుంటారు. కానీ ఇది సరైన పద్ధతికాదు. వరి మొనలలో సాంద్రతే కీలకం. దగ్గరగా నాటడం వల్ల మొక్కలకు అంతర వాతావరణం అనుకూలించక తెగుళ్లసోకే అవకాశంవుంది. ముఖ్యంగా గొచ్చులుగా నాటిన పంటపొలాల్లో సుడిదోమ ఆశించే అవకాశంవుంది.

**కాలిబాటలతో ఉపయోగాలు**

- వరిలో తెగుళ్లను సమర్థవంతగా తట్టుకొనేందుకు ప్రతీ రెండు మీటర్లకు 20 సెం.మీల దూరంలో కాలిబాటలను వేసుకోవాలి.
- కాలిబాటలతో మొక్కల సామర్థ్యం పెరుగుతుంది.
- పంటకు గాలి, సూర్యరశ్మి, వెలుతురు పుష్కలంగా లభిస్తుంది.
- పంటలో సూక్ష్మపోషకాలు కూడా పూర్తిస్థాయిలో లభిస్తాయి.
- సుడిదోమ, అగ్గితెగుళ్ల వ్యాప్తిని అదుపు చేయవచ్చు.
- ఎరువులను కాలిబాటల ద్వారా చల్లితే పొలమంతా సమానంగా వేసేందుకు అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువు మొక్కలకు పూర్తిస్థాయిలో అందుతుంది.
- కిరణజన్య సంయోగక్రియ అధికంగా జరిగి మొక్కలలో పత్రహరితం అధికంగా ఉత్పత్తి కావడంతో పంట దిగుబడులు పెరిగేందుకు అవకాశం ఉంటుంది.
- వరిలో కలుపును సులభంగా నియంత్రించేందుకు వీలుంటుంది.
- ఎలుకలను సమర్థవంతంగా అదుపుచేయవచ్చు.
- కోత సమయంలో పంట నేలవాలితే నిలబెట్టడానికి అనుకూలంగా ఉంటుంది.

# రోగులకు మౌలిక సదుపాయాల కల్పన



మాట్లాడుతున్న ఎంపీపీ రమణమ్మ

సీతానగరం: మండలంలోని పీహెచ్‌సీల్లో రోగులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, అత్యవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీపీ బి.రమణమ్మ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన వైద్యాధికారులు డాక్టర్ శిరీష, ఉషారాణిలతో పీహెచ్‌సీ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యానికి గురై వైద్యసేవలను పొందడానికి గ్రామాల నుంచి వచ్చిన రోగులు సేద తీర్చుకునేందుకు కుర్చీలు, తాగడానికి మంచినీరు, గాలి సౌకర్యంతో పాటు రోగ నిర్ధారణ అనంతరం నివారణకు అవసరమైన మందులు సమకూర్చాలని సూచించారు. పీహెచ్‌సీ పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా పారిశుధ్య పనులు చేయించాలని చెప్పారు. సీనియర్ డాక్టర్ శిరీష ఈ సందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీలో రోజుకు 50 నుంచి 90 మంది వరకూ రోగులకు వైద్య సేవలందించడం, ప్రసవ సమయంలో నిరంతరం సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందిస్తున్నట్లు తెలియజేశారు.డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ గ్రామాల్లో పలురకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులను 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంతో తనిఖీ చేసి మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ పి చిట్టెమ్మ, సలహాకమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీ వార్డు ఎన్నికలకు నోటిఫికేషన్



జోగింపేటలో నోటీసు బోర్డులో నోటిఫికేషన్ పత్రాలు అమర్చుతున్న ఈఓపీఆర్డీ కుమారవర్మ

సీతానగరం: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఖాళీ అయిన వార్డుమెంబర్ల ఎన్నికలు నిర్వహించడానికి ఆయాగ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నోటీసులను ఎన్నికల అధికారులు మంగళవారం ప్రదర్శించినట్లు ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లచ్చయ్యపేట 6వ వార్డుకు ఎన్నిక నిర్వహించడానికి అవసరమైన ఎన్నిక ప్రక్రియ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్, కార్యదర్శి మురళి నోటిఫికేషన్ ప్రదర్శించడంతో పాటు నామినేషన్ స్వీకరణ ప్రారంభించారని తెలియజేశారు. అలాగే జోగింపేటలో ఎస్టీ కుటుంబాలు లేని కారణంగా 1వవార్డు, 7వ వార్డులకు గతంలో ఎన్నికలు జరగలేదని, తాజాగా అవే వార్డులకు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు రావడంతో నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలియజేశారు. గిరిజన కుటుంబాలు లేని కారణంగా నామినేషన్లు స్వీకరణ ప్రారంభించినప్పటికీ ఒక్క నామినేషన్ కూడా పడలేదని చెప్పారు. ఎన్నికల అధికారులుగా ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, కార్యదర్శి కిరణ్‌కుమార్‌లు వ్యవహరిస్తారని తెలియ జేశారు. లచ్చయ్యపేట వార్డు మెంబరు ఎన్నిక ఏకగ్రీవమయ్యేందుకు గ్రామ పెద్దలతో ఎన్నికల అధికారి సమాలోచనలు చేస్తున్నట్లు తెలియవచ్చింది.

# చెరకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

● ఏపీటిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలోని చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. తామరఖండి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గ్రామపెద్దల ఆహ్వానం మేరకు వచ్చిన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ చెరకు రైతుల సమస్యలను గురించి నేరుగా వారిని మంగళవారం కలిసి తెలుసుకుని పరిష్కరించే దిశగా ప్రభుత్వ పెద్దల సహకారంతో కలిసి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎవ్వరూ అధైర్య పడవద్దని రైతులకు భరోసా కల్పించారు. నిరుపేదలకు ఇస్తున్న ఇంటి స్థలాల్లో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టి సొంత ఇంటి యజమానులు కావాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రైతుల పక్షాన భారతదేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయలేని విధంగా రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి నిరుపేద రైతులకు అండగా నిలిచిన ఘనత ఈ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. ఇటువంటి మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోన్ రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని, రాబోయే రోజుల్లో మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్, మాజీ సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ఓటరు నమోదుకు సహకరించండి

● ఆర్డీఓ హేమలత



సమావేశంలో మాట్లాడుతున్న రెవిన్యూ డివిజనల్ అధికారి హేమలత

పార్వతీపురంటౌన్: ఓటరు నమోదుకు సహకరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె స్థానిక ఆర్డీఓ కార్యాలయం సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో ఓటు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడానికి సహకరించాలని కోరారు. ఇంటింటికీ ఓటరు ధ్రువీకరణ కార్యక్రమం జూలై 21 నుంచి జరుగుతోందని తెలిపారు. డూప్లికేట్ ఎంట్రీలు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాల పరిశీలన, ఓటర్ల జాబితాలో సవరణలు ఉంటే వాటిని గుర్తిస్తారని పేర్కొన్నారు. చిరునామా మార్చుకున్న ఓటర్ల వివరాలు, డోర్ నంబర్ అడ్రస్ వెరిఫికేషన్ చేస్తారని చెప్పారు. ఇంటి నంబర్లకు సంబంధించిన ఎంట్రీల సవరణ కోసం ఫారం-8 సేకరిస్తారని వివరించారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లు డిసెంబరు 26 నాటికి పరిష్కరించనున్నట్లు చెప్పారు. తుది ఓటరు జాబితాను 2024 జనవరి 5వ తేదీన ప్రచురించనున్నామని వివరించారు.సమావేశంలో తహసీల్దార్లు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సక్రమంగా రూపొందించాలి



ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కృష్ణారావు

పాలకొండ:

ఓటరు జాబితాలు సక్రమంగా తయారు చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని బీఎల్ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 21లోగా ఇంటింట ఓటరు సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను భద్రంగా ఉంచాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సహాయంతో ఎటువంటి వివాదాలు లేకుండా సక్రమంగా జాబితా సిద్ధం చేయాలన్నారు.

● భామిని: మండలంలోని బాలేరు పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఇంటింటి ఓటరు సర్వేను ఈఓపీఆర్డీ జి.కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించడంతో పాటు తప్పులు ఉండే సవరించాలని సూచించారు. అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు.